క్లుప్తంగా

ఏఐఏయూఎస్ గ్రేటర్ కార్యదర్శిగా విద్యాసాగర్

మోతీనగర్: కూకట్‌పల్లి దేవి గ్రాండ్ హోటల్‌లో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం (ఏఐఏయూఎస్) గ్రేటర్ హైదరాబాద్ ప్రతినిధుల సమావేశంలో హైదరాబాద్ పూర్తి కమిటీని 34మందితో అధ్యక్షుడు కర్క నాగరాజు నియమించారు. వీరిలో అల్లాపూర్‌కు చెందిన టి. విద్యాసాగర్‌ను గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సంఘం జాతీయ కోఆర్డినేటర్ వరుణ్ కుమార్, హైకోర్టు సీనియర్ న్యాయవాది బాలత్రిపుర సుందరి చేతుల మీదుగా విద్యాసాగర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం ప్రభాకర్, కె.వినయ్‌కుమార్, కర్క పెంటయ్య, బేగరి రాజు, రవీందర్, డాకయ్య, ప్రమోద్, మంజుల, బోడ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు పనుల పరిశీలన



మాధవినగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ మాధవినగర్ కాలనీలో రూ.30లక్షలతో చేపట్టిన వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావుకు, కార్పొరేటర్ సతీష్ గౌడ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాగయ్య, లతీఫ్, రెడ్డి, అశోక్, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

భాగ్యనగర్: ఆంజనేయస్వామి దేవాలయంలో దొంగలు పడి హుండీ పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి గుడి సమీపంలో ఉన్న చెట్టుపై నుంచి దేవాలయంలోకి ప్రవేశించిన దొంగలు హుండీ తాళం పగలగొట్టి నగదును ఎత్తుకొని పరారయ్యారు. దేవాలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యూనివర్సిటీ పాలనలో నాయకత్వ శూన్యత

ప్రొ. లింబాద్రి

లాలాపేట: యూనివర్సిటీల్లోని అకడమిక్ పరిపాలనలో నాయకత్వ శూన్యత ఉందని, రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా యూనివర్సిటీల్లో నాయకత్వం వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఓయూ అధ్యాపకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి అన్నారు. ఓయూలోని హెచ్‌ఆర్‌డీసీ ఆధ్వర్యంలో గత వారం రోజుల పాటు నిర్వహిస్తున్న 'అకడమిక్ నాయకత్వ శిక్షణ' ముగింపు కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొ. రవీందర్‌తో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆచార్యులకు ఈ తరహా నాయకత్వ శిక్షణ ఇవ్వటం రాష్ట్రంలోనే తొలిసారి అని ఆయా విభాగాలకు నాయకత్వం వహించే అధ్యాపకులకు ముక్కుసూటితనం, స్పష్టమైన అవగాహన, పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలకు లోబడి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, రెడ్యానాయక్, హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొ. స్మిత, సి.పవార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికే రోడ్డు నిర్మాణం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 ప్రధాన రహదారి నుంచి మాధవరం కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై నూతనంగా సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశతో కలిసి బుధవారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ చౌరస్తాలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రోడ్డును విస్తరించి సీసీరోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, వెంకటేష్ గౌడ్, మోహన్‌రావు, శాస్త్రి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ఏదీ శ్రద్ధ..?

అస్తవ్యస్త పరిసరాల్లో తినుబండారాల తయారీ

- మాంసం క్రయవిక్రయాల్లోనూ అపరిశుభ్రత
- నాణ్యతమైన పదార్థాలు అందించడంలో విఫలం
- కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం
- తనిఖీలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజారోగ్యంపై అశ్రద్ధ ప్రాణాల మీదకు తెస్తోంది.. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు పరిశుభ్రత తమ పరిధిలో లేదన్నట్లు, అది తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా.. గ్రేటర్ శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. పురపాలక సంఘాల్లోని పలు కూడళ్లు, చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితోపాటు హైదరాబాద్-నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, టీ కొట్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనడంలో సందేహం లేదు. రహదారులపై ఉండే హోటళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహార పదార్థాలపై పడుతోంది. అయినా నిర్వాహకులు వాటిని విక్రయిస్తున్నారు. చేతులకు రక్షణ కవచాలు(తొడుగులు)వేసుకోకుండానే ఆహార పదార్థాలు, తినుబండారాలు తయారు చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్ రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు.

◆ కల్తీ నూనె, ప్రమాదకరమైన రంగులు..

ఆహార పదార్థాల తయారీలో భాగంగా వంటకాల్లో వాడిన నూనెనే తిరిగి వాడుతుండటంతో ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారుతోంది. కొంతమంది కల్తీ నూనెల్లోనే ఆహార పదార్థాలను వండుతున్నారు. ఎలాంటి రక్షణ లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి. వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆహార పదార్థాల్లో ప్రమాదకరమైన రంగులను వాడుతున్నారు. హోటళ్లలో సమోసాలు, బజ్జీలు, గారెలకు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చికెన్, వెజ్ మంచూరియాల తయారీలో ఎరుపు రంగులు వాడుతున్నారు. మిగిలిపోయిన వాటిని ఫ్రిడ్జ్‌ల్లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నుంచి వెలువడే పొగతో కూడా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు, తోటి వ్యాపారులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. కూతవేటు దూరంలో పురపాలక సంఘాల కార్యాలయాలు ఉన్నా.. తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

◆ హెల్త్ ఆఫీసర్ల పట్టింపేదీ..?

గ్రేటర్ శివారు జిల్లాల్లోని 29 పురపాలక సంఘాలతో పాటు 614 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో మెజారిటీ పురపాలక సంఘాలు, జీపీల్లోని మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించడం లేదు. పురపాలక సంఘాల్లోని మాంసం దుకాణాలపై హెల్త్ ఆఫీసర్ల పర్యవేక్షణ ఏమాత్రం లేకపోవడంతో ఫ్రిడ్జిల్లో రెండు, మూడు రోజుల పాటు ఉంచిన మాంసాన్ని కూడా విక్రయిస్తున్నారు. దీంతో పట్టణవాసులు రోగాల బారిన పడుతున్నారు.

◆ పర్యవేక్షణ కరవై..

గ్రేటర్ శివారుల్లో పెరుగుతున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ కొట్లకు అనుగుణంగా ఆహార భద్రతాధికారులు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోందని తెలుస్తోంది. మేడ్చల్ జిల్లాలో నాలుగేళ్లుగా ఆహార భద్రతాధికారి పోస్టు ఖాళీగా ఉంది. పురపాలక సంఘాల్లో కూడా హెల్త్ ఆఫీసర్లు లేకపోవడంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లోని పదార్థాలపై పర్యవేక్షణ కరువైంది. హోటళ్లు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు పాటించని వారిపై..

వర్షాకాలం ఆరంభంతో తినుబండారాల తయారీ కేంద్రాలు పరిశుభ్ర వాతావరణంలో ఉండేలా పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) అభిషేక్ ఆగస్త్య పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాల నిర్వాహకులు పరిశుభ్రత పాటించేలా నోటీసులు అందిస్తామన్నారు. పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించే బాధ్యత ఆహారభద్రత శాఖాధికారులు చేపట్టాల్సి ఉందన్నారు.

8న ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 8న భారత ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి పర్యటనను పురస్కరించుకొని ఏర్పాట్లపై సంబంధిత శాఖలు అధికారులతో ఆయన చర్చించారు. 8న హకీంపేట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ చేరుకుంటారని, అందుకు సంబంధించి జిల్లా అధికారులు హకీంపేటలో తగిన ఏర్పాట్లతోపాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రధానమంత్రి పర్యటనలో ప్రోటోకాల్‌ను అనుసరించి ఏవిధమైన లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు రవి, మల్లయ్య, డీఎఫ్‌ఓ జానకిరామ్, డీఎస్‌ఓ తనూజ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా ఇంటింటి విచారణ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌ఓ చంద్రావతితో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు 18ఏళ్లు నిండిన వారిని చేర్పించడంలో బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించటంతో పాటు ఓటుహక్కు వినియోగంలో అవకతవకలు అరికట్టడంపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించిందన్నారు. నూతనంగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీకి బూత్‌స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ శ్రీనివాస్ మూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అంబీర్ చెరువులో చేపల పెంపకానికి చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో మత్స్య సహకార సంఘం శంషీగూడ సభ్యులు, తదితరులు

ఆల్విన్‌కాలనీ: అంబీర్ చెరువులో ఐదు లక్షల చేప పిల్లలను వదలాలని మత్స్య సహకార సంఘం శంషీగూడ సభ్యులు బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం శంషీగూడ సభ్యులు మాట్లాడుతూ అంబీర్ చెరువు సుందరీకరణ, అభివృద్ధి చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించామన్నారు. మత్స్య సంపద పెరిగితే జీవనోపాధి పెరుగుతుందన్నారు. మత్స్యకారుల కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయని అన్నారు. అంబీర్ చెరువులో చేపల పెంపకం విషయమై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే చేప పిల్లల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం శంషీగూడ చైర్మన్ జోగిపేట లింగమయ్య, వైస్ చైర్మన్ జోగిపేట బాల్‌రాజ్, సభ్యులు జోగిపేట భాస్కర్, శంకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, లింగరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు యాజమాన్య హక్కులు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఆస్తి హక్కు కల్పించడానికి జీవో 58, 59 ద్వారా అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా పాపిరెడ్డినగర్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు జీవో నం.58 ప్రకారం వారికి రెగ్యులరైజ్ చేసి వారి జీవితానికి భరోసా కల్పించిన గొప్ప నేత కేసీఆర్ అని కొనియాడారు. రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, భగవంత్‌రెడ్డి, ఈరెడ్డి దేవేందర్‌రెడ్డి, నర్సింలు, రాంరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌ను అభివృద్ధి చేస్తా



నందమూరినగర్‌లో వరదనీటి కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన నందమూరినగర్‌లో చేపడుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. ఎన్నో ఏళ్ల సమస్య నేటితో తీరనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, జలమండలి అధికారులు మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహమూద్, లైన్‌మెన్ సునీల్, సూపర్‌వైజర్ నరేందర్, నాయకులు పోతుల రాజేందర్, వెంకట్రావు, నాగ వరప్రసాద్, శ్రీను, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మల్లికార్జున్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఈటలకు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న గజ్జల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ ఎన్నికల కమిటీ బీజేపీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌కు బుధవారం శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ రాజకీయ అనుభవంతో బీజేపీ బలమైన శక్తిగా ఎదిగి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందన్నారు. అదే విధంగా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. హఫీజ్‌పేట్, గచ్చిబౌలి, చందానగర్, మియాపూర్, కొండాపూర్ డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్, కృష్ణముదిరాజ్, రామిరెడ్డి, మాణిక్‌రావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొత్త పైప్‌లైన్లను వేయాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను కార్పొరేటర్ సబీహా బేగం పరిశీలించారు. శిథిలావస్థకు చేరకున్న పైప్‌లైన్ల స్థానంలో కొత్త వాటిని వేయాలని ఆమె జలమండలి డీజీఎం రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మూర్తిని ఆదేశించారు. పిల్లి తిరుపతి, జాహేద్, షరీఫ్ బాబా, సంజీవరెడ్డి, జగన్నాథం, నసీర్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో తైవాన్ ప్రతినిధుల బృందం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని తైవాన్‌లోని ఆసియా విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. తైవాన్ ఆసియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ యింగ్‌హువాయ్‌చెన్, డాక్టర్ జియున్ జోంగ్‌వు, డాక్టర్ చున్-వీ రెమెన్‌లిన్, డాక్టర్ రాబర్ట్ హ్సు, డాక్టర్ చార్లెస్ సిఎస్‌వాంగ్ బృందం ఉన్నారు. హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు, ఇతర ప్రొఫెసర్లు, డీన్లు పలు అంశాలపై చర్చించారు. ఆసియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, మెడికల్ సైన్సెస్ రంగాలలో బలంగా ఉంది. ఇండో- తైవాన్ కార్యక్రమాలలో భాగంగా రెండు విశ్వవిద్యాలయాలు తాము సహకరించగలిగే అంశాలను అన్వేషించాలని నిర్ణయించారు. ప్రాజెక్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. అంతకుముందు వీసీ ప్రొఫెసర్ బీజేరావు ఈ ప్రతినిధిబృందాన్ని సత్కరించారు. ఓఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ అలోక్‌మిశ్రా పాల్గొన్నారు.

ఏడీపీ ఇండియా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ డ్రైవ్



రాయదుర్గం: ప్రముఖ సాఫ్ట్‌వేర్, సర్వీసెస్ సంస్థ ఏడీపీ ఇండియా నెలరోజుల కమ్యూనిటీ డెవలప్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంత్ ఆఫ్ కేరింగ్‌లో నిత్యావసరాల పంపిణీతో పాటు రక్తదాన శిబిరాలు, మహిళలు, పిల్లల సాధికారత సెషన్లు, ఆర్టిజన్ అండ్ క్రాఫ్ట్ ప్రమోషన్లను నిర్వహించినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ పిల్లలకు దుస్తులు, స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఏడీపీ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ వేములపల్లి మాట్లాడుతూ బాధ్యతగల కార్పొరేట్‌గా కమ్యూనిటీ అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య

మోతీనగర్: అనారోగ్యంతో మానసికంగా బాధపడుతున్న గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుధవారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ కందుకూరు మండలం మాచవరం మధురారెడ్డి పాలెంకు చెందిన మార్తాల మాలకొండయ్య కూతురు మృదులకు వెన్నపూస కిషోర్ బాబులకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి శాశ్విత అనే కూతురు ఉంది. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి పర్వత్‌నగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. కొన్ని రోజుల నుంచి మృదుల (23) మానసికంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల 4వ తేదీన సాయంత్రం ఎవరూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మృతిపై ఎటువంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతురాలి తండ్రి మార్తాల మాలకొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపారు.



బాలానగర్: కూకట్‌పల్లి నుంచి బోయిన్‌పల్లి వైపు వెళ్తున్న ఓ కంటైనర్ బాలానగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దాటిన తరువాత డివైడర్‌ను ఢీకొట్టింది. తెల్లవారుజామున సంఘటన జరగటంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు. బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టి కంటైనర్ అక్కడి నుంచి తరలించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరహరి తెలిపారు.

నల్ల చెరువును అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి నల్ల చెరువు పరిసర ప్రాంత వాసులు, రెవెన్యూ అధికారులతో చెరువు అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నల్ల చెరువు అభివృద్ధికి నల్ల చెరువు ప్రాంత వాసులు ముందుకొచ్చి ప్రభుత్వం అందించే టీడీఆర్‌కు ఒప్పుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ నేపథ్యంలో నల్ల చెరువును అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కులు, ఓపెన్ జిమ్, లైటింగ్, వాటర్‌ఫౌంటైన్, షటిల్‌కోర్టు నిర్మించాలని ఆదేశించారు. కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఎంఆర్‌ఓ గోవర్ధన్, అధికారులు పాల్గొన్నారు.




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సీవరేజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

కేపీహెచ్‌బీ డివిజన్‌లో సీవరేజీ పైప్‌లైన్ పనులకు బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.1.75 కోట్లతో ఈ పనులను చేపడుతున్నామని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 90శాతం పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడా రాజీ పడటం లేదన్నారు. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు లేకుండా భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

పూల్‌బాగ్‌కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శ్రీకారం..

బాలానగర్: బాలానగర్ డివిజన్ పూల్‌బాగ్ కాలనీలో రూ.1.2 కోట్లతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ కాలనీవాసులు దశాబ్దాలుగా డ్రైనేజీ సమస్య ఎదుర్కొంటున్నారని.. ఎంతోమంది పని చేసినా ఈ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారని అన్నారు. ఈ పనులు పూర్తయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.



పూల్‌బాగ్ కాలనీలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్



కేపీహెచ్‌బీకాలనీలో సీవరేజ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే